క్లుప్తంగా

గ్రోయిన్స్ మరమ్మతులకు నిధులివ్వాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ

ఇచ్ఛాపురం రూరల్: తిత్లీ తుఫాన్‌కు కొట్టుకుపోయిన గ్రోయిన్స్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందించారు. బెల్లుపడ గ్రోయిన్‌కు రూ.9.50 లక్షలు, బెల్లుపడ బాహుదానది ఎడమ కాలువ గట్టు నిర్మాణానికి రూ.45లక్షలు, తులసిగాం ధర్మపురం గెడ్డ వద్ద పైపు కల్వర్టు నిర్మాణానికి రూ.8.50 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

ఇచ్ఛాపురం రూరల్: అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు దక్కాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఇచ్ఛాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. శనివారం 14, 15 వార్డులకు సంబంధించి 90 డేస్ గృహ పథకంలో భాగంగా 13 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మి, నాయకులు పిలక విజయభాస్కరరావు, రామ్‌జీ, నీలాపు ఢిల్లీ పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

పలాస: రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు కె.వైకుంఠరావు, టోల్ ప్లాజా మేనేజర్ అనిష్ అన్నారు. బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్, జాతీయ హరిత దళక్లబ్ ఆధ్వర్యంలో సడక్ సురక్ష-జీవన రక్ష కార్యక్రమం చేపట్టారు. రోడ్డు భద్రత, వాతావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్లు కిరణ్‌కుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

మందస: మందస పట్టణంలోని కంచమయకాలనీకి చెందిన సాసుమాల నాగేశ్వరరావు ఇటీవల మృతిచెందారు. ఈయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం వర్తించింది. దీంతో శనివారం రూ.10వేలను నాగేశ్వరరావు భార్య చిన్నారికి అందజేశారు. కార్యక్రమంలో మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, ఎంపీటీసీ కంచి బెహరా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, యర్నాగుల నాగరాజు, కొండల ఢిల్లేశ్వరరావు, తలగాన హరికృష్ణ, శంకర్, సంతోష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక నిఘా వేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. లింగ నిర్ధారణ నియంత్రణపై టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలపై ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా వేయాలన్నారు. వారాంతపు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసీ, డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ సూర్యకళ, వెంకటేశ్వరరావు, వైద్యులు ధనలక్ష్మి, స్రవంతి, మహరాజ్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, అభయం సంస్థ ప్రతినిధి డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

టెక్కలి: వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పట్ల వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ కేసులపై అప్రమత్తంగా వ్యవహరిస్తూ మాతా శిశు మరణాలు లేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సమీక్షకు హాజరు కాని బోరుభద్ర, బైదలాపురం పీహెచ్‌సీ వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ తులసీ, వైద్యులు పాల్గొన్నారు.

టీడీపీ మాయమాటలను
ప్రజలు గుర్తించారు

- కేంద్రం నుంచి ఒక్క ప్రాజెక్టునూ జిల్లాకు తేలేకపోయారు
- పలాస రైల్వేస్టేషన్‌లో స్టీలు కుర్చీలు తప్ప చేసిందేమీ లేదు
- ఎంపీ రామ్మోహన్‌నాయుడుపై మంత్రి సీదిరి అప్పలరాజు మండిపాటు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మైకు దొరగ్గానే కబుర్లు చెప్పడం తప్ప పలాస నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని మంత్రి సీదిరి అప్పలరాజు దుయ్యబట్టారు. పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 5వ వార్డు తాళ్లభద్రలో కౌన్సిలర్ కర్రి మాధవరావు ఆధ్వర్యంలో శనివారం జగనన్న సురక్ష అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఇష్ట మొచ్చినట్లు మాట్లాడితే రానున్న ఎన్నికల్లో ప్రజలే తొక్కేస్తారని చెప్పారు.

ఎంపీగా రెండు సార్లు గెలిపిస్తే పలాస రైల్వేస్టేషన్‌లో స్టీలు కుర్చీలు వేయడం తప్ప చేసిందేమీ లేదని, జిల్లాకు ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేకపోయారని మంత్రి మండిపడ్డారు. గ్రామీణ సడక్ యోజన కింద పలాసలో రోడ్లు అభివృద్ధి చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పెట్టామని, జిల్లా నుంచి ఎంపీతో కవరింగ్ లెటర్ పెట్టమని సూచించగా కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పలాస నియోజకవర్గానికి గ్రామీణ సడక్ యోజన నిధులు మంజూరయ్యేలా చేసిందన్నారు. టీడీపీ నాయకురాలు గౌతు శిరీషా మాటతీరు మార్చుకోవాలని హితవుపలికారు. వచ్చే ఎన్నికల్లో పలాస నియోజకవర్గం నుంచి తరిమేసే రోజులు దగ్గర పడ్డాయన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తీరనున్నాయని చెప్పారు. అనంతరం తాళభద్రకు చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో మంత్రి సమక్షంలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్‌కుమార్, పాలిన శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవాని శంకర్, అధికార ప్రతినిధులు గుజ్జు జోగారావు, శిష్టు గోపి, సచివాలయం కన్వీనర్ బడగల బల్లయ్య, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పలాస మండల అధ్యక్షుడు పైల వెంకటరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ మళ్లా రవికుమార్, కంచు నీలకంఠం, మహిళా శక్తి కన్వీనర్ జ్యోతి, ఆకులమ్మ, నారాయణరావు, యోగి, డబ్బీరు సురేష్, శ్రీనాథ్, లక్ష్మణ్, అశోక్, శ్రీను, జోగారావు, భాస్కరరావు, జగ్గారావు, నర్సింహులు, కాశీరావు, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

● కనుల పండువగా కలశ యాత్ర



బెన్నుగానిపేటలో గ్రామ దేవత మా అంబికాదేవి మందిరం పునః ప్రతిష్ఠ సందర్భంగా ఇచ్ఛాపురం బాహుదానదిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు కలశాలలో నదీ జలాలను తీసుకొచ్చి అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేశారు. - ఇచ్ఛాపురం రూరల్

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం



పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో గౌతు కుటుంబం చేపట్టిన శాశ్వతమైన నిర్మాణం ఒక్కటైనా చూపించాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 4వ వార్డు పద్మనాభపురం కాలనీలో కౌన్సిలర్, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం మీసాల సురేష్ ఆధ్వర్యంలో 40 మంది టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, నాయకులు డబ్బీరు భవానీశంకర్, కోత పూర్ణచంద్రరావు, దున్న సత్యం, గుజ్జు జోగారావు, శిష్టు గోపి, బడగల బళ్లయ్యానాయుడు, బెల్లాల శ్రీనివాసరావు, బళ్ల శ్రీనివాసరావు, బోర భగవతి, బోనెల రాము, రోణంకి శ్రీనివాస్, బమ్మిడి సంతోష్, అంబటి ఆనందరావు, కర్రి మాధవరావు, పప్పల ప్రసాద్, బడకల పులిరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పథకాల లబ్ధిని వివరిస్తున్న దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. ఉదయపురం, సురాడవానిపేట గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఎంత లబ్ధిపొందారో వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డినే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వెంకటేష్, కొండయ్య, ఎస్.భీమారావు, పి.రామకృష్ణ, పి.శ్రీనివాస్‌రెడ్డి, అప్పారావు, గంట ఈశ్వరరావు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి తీరుపై విచారణ



విచారణ చేపడుతున్న ఉపవిద్యాశాఖాధికారి పగడాలమ్మ

కవిటి: మండలకేంద్రం కవిటి జెడ్పీ ఒడియా ఉన్నత పాఠశాలలో ఒడియా స్కూల్ అసిస్టెంట్ కేసీ పాఢి తీరుపై అందిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ శనివారం విచారణ చేపట్టారు. విద్యార్థినుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ, కులంపేరుతో మందలిస్తున్నారని, తిడుతున్నారన్న ఆరోపణల మేరకు వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని చెప్పారు. గణితం స్కూల్ అసిస్టెంట్ సూరజ్ కుమార్ లిమ్మి గంట ఆలస్యంగా విధులకు హాజరుకావడం, డ్రెస్ కోడ్ సక్రమంగా లేకపోవడం గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీ పి.నీలాచలం, బెహరావీధి పెద్దలు పాల్గొన్నారు. అనంతరం మాణిక్యపురం హైస్కూల్‌ను సందర్శించారు. ఎంఈఓ ధనంజయ మజ్జితో మాట్లాడి జేవీకే కిట్లపై ఆరాతీశారు.

జగనన్న సురక్షపై అవగాహన

టెక్కలి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపకల్పన చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో వచ్చిన వినతుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ సిబ్బందిని ఆదేశించారు. శనివారం టెక్కలి మండలం నరసింగపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈయనతో పాటు పంచాయతీ కార్యదర్శి బి.రమేష్ ఉన్నారు.

● **టెక్కలి:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూపకల్పన చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంపై శనివారం బూరగాంలో ఇంటింటా అవగాహన కల్పించారు. ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి, సర్పంచ్ ఎల్.సంజీవరావు,నాయకులు జె.తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ సీహెచ్.ఈశ్వరమ్మ అన్నారు. శనివారం అనంతగిరి పంచాయతీలో సర్పంచ్ కానకాన మల్లేశ్వరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం అమలు, సమస్యలు, టోకెన్‌జారీ తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది, కన్వీనర్, గృహ సారథులకు అవగాహన కల్పించారు. పెద్దబొడ్డపాడులో సర్పంచ్ టి.ఢిల్లీరావు, కొండవూరులో సర్పంచ్ కె.భాస్కరరావు నేతృత్వంలో అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సభ్యులు ఉరిటి కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య అన్నారు. శనివారం 16,17 వార్డు సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పించారు. నాయకులు టెంకా లోకేశ్, సందీప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **సోంపేట:** జగననన్న సురక్ష కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఇస్కలపాలెం, బెంకిలి పంచాయతీల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో కన్వీనర్లు కోటరాజు, తట్ట షణ్ముఖరావు, బైపల్లి రామారావు, గృహసారథి కోట యర్రమ్మ, ఎంఎల్ఓ సోమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బి.సునీల్, బెందాళం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● **కోటబొమ్మాళి:** జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా ప్రతి గడపకు వెళ్లి సమస్యలను తెలుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ దువ్వాడ వాణి అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, వైస్ ఎంపీపీ దుక్క రోజా, సర్పంచ్ ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

● **నందిగాం:** అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్షను రూపొందించినట్లు జగనన్న సచివాయ కన్వీనర్ల మండల చైర్మన్ జడ్యాడ జయరాం అన్నారు. శనివారం నందిగాం మండలం కొత్త అగ్రహారం సచివాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ సువ్వారి వసంత్‌కుమార్, కింతల శేషగిరి, కూన శాంతారావు, రోణంకి ఢిల్లేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

వజ్రపుకొత్తూరు: వచ్చే ఏడాది జనవరి నాటికి ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించాలని పలాస ఆర్డీఓ టి.సీతారామ్మూర్తి అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి అధ్యక్షతన బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. కొత్తగా ఓటర్ల నమోదు, తప్పులు, చేర్పులు ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉప తహసీల్దార్ వి.గిరిరాజ్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కాశీబుగ్గ: జగద్గురు పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలకు ఎండోమెంట్ ఆదరణ పథకం కింద నెలకు రూ.5 వేలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పలాసలోని 4వ వార్డులో శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంత్రి సీదిరి అప్పలరాజు పాలాభిషేకం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి చిన్నాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ షణ్ముఖశర్మ, వజ్రాల విష్ణు, పొందూరు సాంబశివరావు, లక్కోజు ధర్మారావు, కొండపల్లి అర్జునరావు, సోపింటి ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శివారు భూములకు సాగునీరు అందించాలి

కాశీబుగ్గ: ఖరీఫ్ సీజన్‌లో వంశధార నీటిని శివారు భూములకూ అందించాలని, అన్ని రకాల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని రైతుకూలీ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పలాసలోని న్యూడెమొక్రసీ కార్యాలయంలో శనివారం అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు రుణాలు అందేలా దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, వంకల పాపయ్య, తాతారావు, టి.దమయంతి, జుత్తు వీరస్వామి, కోసింటి సోమేశ్వరరావు, సరస్వతి, సుహాసిని, ఆనంద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు సకాలంలో పూర్తి చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా మంజూరు చేసిన నూతన అంగన్‌వాడీ భవనాలను సకాలంలో పూర్తి చేయాలని సీడీపీఓ పి.నాగరాణి అన్నారు. ఈ మేరకు శనివారంమండల విద్యావనరుల కేంద్రంలో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు చేశారు. ఏపీఈడబ్ల్యూడీసీ జేఈ అట్టాడ సునీల్ కుమార్, సూపర్‌వైజర్ నీలవేణి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కాశీబుగ్గ: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, సర్‌చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాశీబుగ్గ పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద వామపక్షాలు శనివారం ధర్నా చేపట్టాయి. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 30న సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.గణపతి, సీహెచ్ వెంకటరమణ, వంకల మాధవరావు, కుత్తుము దుశ్యంత్, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనం వేలం

కంచిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 26న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఎస్.బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వెయ్యి చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తారకేశ్వర్ పండా తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ప్లస్ 2గా అప్‌గ్రేడ్ చేసిందని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మందస: మండలంలోని బైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు)లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి శనివారం చెప్పారు. 6వ తరగతిలో 56 సీట్లు, 7వ తరగతిలో 44 సీట్లు, 8వ తరగతిలో 49 సీట్లు, 9వ తరగతిలో 46 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎస్సీ విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 28లోపు దరఖాస్తులు అందివ్వాలని, 30న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

మిగులు సీట్ల భర్తీకి ఆహ్వానం

కంచిలి: మఠంసరియాపల్లిలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో 8, 9వ తరగతులలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ తెలిపారు. ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 30న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9985975684, 8374433269 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కుష్ఠువ్యాధి రహిత సమాజమే లక్ష్యం

కవిటి: ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేసి కుష్ఠువ్యాధి రహిత సమాజాన్ని స్థాపిద్దామని ఆర్.బెలగాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పి.రాకేష్, డాక్టర్ డి.కవిత అన్నారు. శనివారం ఆర్.బెలగాం పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన వలంటీర్లతో కుష్ఠు వ్యాధి నిర్మూలన సర్వేపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ ఒక గ్రామంలో ఆశ కార్యకర్త, మేల్ వలంటీర్ 20 కుటుంబాలను కలిసి తెలుపు మచ్చలు, ఇతర సమస్యలు ఉన్నట్టు గుర్తిస్తే తమకు తెలియజేయాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ మాదిన కృష్ణారావు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ, పీహెచ్ఎన్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ నిధులతో నీటి సరఫరా

కంచిలి: మండల కేంద్రం కంచిలి పంచాయతీ పరిధిలో పలు ఆవాస ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో మండల పరిషత్ నిధులతో నీటి సరఫరా చేపట్టారు. బలియాపుట్టుగ కాలనీ, దాకరాపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు జోగేంద్ర చౌదరి, డొక్కరి భోగయ్యల ఆధ్వర్యంలో శనివారం నీటి సరఫరా చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న అడిషనల్ జిల్లా జడ్జి

కోటబొమ్మాళి: శ్రీకాకుళం అడిషనల్ (ఫ్యామిలీ కోర్టు)జిల్లా జడ్జి పి.భాస్కరరావు శనివారం కోటబొమ్మాళిలో కొత్తమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి కోర్టు ఇన్‌చార్జి జడ్జి భరణి, ఏజీపీ ఎస్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ సీతన్నపేటకు చెందిన పల్లా సిమ్మన్న ఇటీవళి మరణించడంతో వారి కుటుంబానికి మంజూరైన వైఎస్ఆర్ బీమా లక్ష రూపాయల చెక్కును వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాల్ల సంజీవరావు శనివారం అందజేశారు. కార్యక్రమంలో అనపాన కర్రెయ్య, జీరు లక్ష్మణ, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రకళ, వలంటీర్ భాస్కరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హీరా పంచమి పూజలు

కంచిలి: కంచిలి, జలంత్రకోట, కొల్లూరు గ్రామాల్లో గుడించా మందిరాల్లో జగన్నాథునికి శనివారం హీరాపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచిలిలో శనివారం రాత్రి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగనన్న కిట్లపై ఆరా

నందిగాం: జగనన్న విద్యాకానుక కిట్లను ప్రతి విద్యార్థి సక్రమంగా వినియోగించుకోవాలని ఎంఈఓ-2 అన్నపురం చిన్నారావు అన్నారు. శనివారం లఖిదాసుపురం ఉన్నత పాఠశాలను సందర్శించి జగనన్న కిట్లపై ఆరా తీశారు. హెచ్ఎం చిలుకు కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది బాలక రామారావు, తులసి ప్రసాద్, గోవిందరావు, బెందాళం రత్నం, రంకిడి రామారావు, ప్రియదర్శిని, యాగాటి త్రినాథరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు పాతిక లక్షల యాభై వేల రూపాయలతో పది డ్రైనేజీ పనులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ శనివారం తెలిపారు. రెండు లక్షలతో తహసీల్దార్ కార్యాలయం, రెండున్నర లక్షలతో లొద్దపుట్టి జగనన్న కాలనీ, నాలుగు లక్షలతో పాయితారి, రెండు లక్షలతో ముచ్చింద్ర, రెండు లక్షలతో బలరాంపురం, రెండు లక్షలతో కొత్త శాసనాం, రెండున్నర లక్షలతో కేదారిపురం, రెండున్నర లక్షలతో డొంకూరు, మూడు లక్షలతో కీర్తిపురం, మూడు లక్షలతో మండపల్లి గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని వివరించారు.

నేత్రపర్వంగా దశావతార వైభవం

కవిటి: కవిటి జగన్నాథ ఆలయంలో స్వామివారు శనివారం హీరాపంచమి సందర్భంగా లక్ష్మీనరసింహుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునుంచే పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జగన్నాథ భజన మండలి ఆధ్వర్యంలో ఏకాహం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

నరసింహుని అవతారంలో..

టెక్కలి: పట్టణంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు నరసింహుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తాగునీటి బోరుకు శంకుస్థాపన

కంచిలి: బొగాబెణి గ్రామంలో పంచాయతీ నిధులతో బోరు ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గణప సింహాచలం, ఉప సర్పంచ్ జలసూత్ర కామేషు, పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ పనితీరుపై ఫిర్యాదు

కంచిలి: జాడుపూడి కాలనీలో నిర్వహిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం పనితీరుపై ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి శనివారం జరిగిన జడ్పీ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. 400 మందికి పైగా బాలికలు చదువుతున్నా ఇక్కడ సేవలందించే ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పనితీరు బాగోలేదని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన సాంస్కృతిక చైర్మన్

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక కార్పోరేషన్ చైర్మన్, సినీ నటుడు జోగినాయుడు (జోగిబ్రదర్స్) మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం సాయంత్రం కలిశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరుగుతున్న గడప గడపకు కార్యక్రమంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.